క్లుప్తంగా

పంటల నమోదుతో రైతులకు మేలు



పోతారంలో పంటల వివరాలను పరిశీలిస్తున్న డీఏఓ శివప్రసాద్

బెజ్జంకి(సిద్దిపేట): పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటే రైతులకు మేలు జరుగుతుందని డీఏఓ శివప్రసాద్ అన్నారు. మండలంలోని పోతారంలో బుధవారం నిర్వహిస్తున్న పంటల నమోదు తీరును పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుంటే పంటల విక్రయం సులభమవుతుందని, మద్దతు ధర లభిస్తుందన్నారు. చౌడు భూముల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సంతోష్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జిల్లా సరిహద్దులో ప్రత్యేక నిఘా పెట్టాలని ఏసీపీ బాలాజీ అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్ఐ చంద్రమోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాలు రవాణా కాకుండా ఉండేందుకు నిఘా పెంచాలన్నారు. జిల్లా సరిహద్దు పోలీస్‌స్టేషన్ పటిష్టంగా ఉండాలన్నారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణను అరికట్టాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీ కండువా కప్పుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కొండపాక మండల మాజీ ఎంపీపీ అనంతుల పద్మ భర్త నరేందర్, కొండపాక మాజీ ఎంపీటీసీ దొమ్మాట లక్ష్మి భర్త లక్ష్మారెడ్డి బుధవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, కొండపాక, కుకునూరుపల్లి మండల పార్టీ అధ్యక్షుడు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మార్చి 1వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో మార్చి 1వ తేదీన విజయ సంకల్ప బస్సుయాత్ర కొమురవెల్లిలో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి సామాజిక న్యాయ సాధికార కేంద్ర మంత్రి నారాయణస్వామి హాజరవుతారని తెలిపారు.

సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థ



బీమా పత్రాలను అందిస్తున్న టెక్నికల్ సర్వీసు అధికారి ప్రశాంత్

సిద్దిపేటజోన్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందని టెక్నికల్ సర్వీసు అధికారి ప్రశాంత్ తెలిపారు. బుధవారం లక్ష్మీ నర్సింహ ఐరన్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాట్ గ్రూప్ కంపెనీస్ 12 దేశాలలో విస్తరించిందన్నారు. భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణంలో చాలా దృఢత్వం ఉంటుందన్నారు. అల్ట్రా ఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు రోడ్ల నిర్మాణానికి సరైన ఎంపిక అని పేర్కొన్నారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం చేస్తామని తెలిపారు. ఇంటి నిర్మాణంలో తీసుకొనే జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. సమావేశానికి వచ్చిన మేస్త్రీలందరికీ లక్ష రూపాయల ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. సమావేశంలో మార్కెటింగ్ ఆఫీసర్ రాజు, డీలర్ దేవేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ

అసంపూర్తిగా సమీకృత భవనం

- నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరు
- ఆరేళ్లుగా కొనసాగుతున్న వైనం
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నిర్మాణంలో ఉన్న సమీకృత భవనం

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 2018 ఫిబ్రవరిలో సమీకృత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించిన నాటి నుంచి మూడేళ్ల లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. సమీకృత భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరేళ్లు దాటింది. ఇప్పటి వరకు 80 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. నిర్మాణ పనులు మందకొడిగా సాగుతుండటంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– చేర్యాల(సిద్దిపేట)

పనుల విషయానికి వస్తే జిల్లా ఏర్పాటు అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పట్టణ కేంద్రంలో సమీకృత భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.17 కోట్లు మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన పలోమి సంస్థ సకాలంలో నిర్మాణం పూర్తి చేయలేదు. కొన్ని రోజులకు అదే కంపెనీ పేరుతో మరో కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఆరేళ్లుగా నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

అప్పటి మంత్రి హెచ్చరించినా..

2021 ఆగస్టు 9వ తేదీన మంత్రి హరీశ్‌రావు పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చారు. ఈ సందర్భంలో సమీకృత భవన నిర్మాణ పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. పనుల తీరు చూసి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్లు గడిచినా పనులు పూర్తి కాకపోవడమేమిటని ప్రశ్నించారు. మళ్లీ 2022 ఏప్రిల్ 6వ తేదీన రైతు బజారు ప్రారంభోత్సవానికి వచ్చి మరోసారి పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, త్వరగా పూర్తిచేయించాలని పంచాయతీరాజ్ ఈఈ, డీఈలకు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయాల కోసమైనా కొన్ని గదులను త్వరగా పూర్తి చేయాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలను తాత్కాలిక భవనాల్లో కొనసాగిస్తున్నారు.

కార్యాలయాలు లేక..

మండల స్థాయిలో సేవలు అందించే కార్యాలయాలు పట్టణ కేంద్రానికి నలుమూలలా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. మున్సిపల్ కార్యాలయ స్థలంలో నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం చేయడంతో కార్యాలయాన్ని హాస్టల్ భవనంలోకి తాత్కాలికంగా మార్చారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయాన్ని కోర్టు భవనానికి అప్పగించి పక్కనే ఉన్న స్త్రీ శక్తి ఉపాధి హామీ భవనంలోని రెండు గదుల్లో ఎంపీడీఓ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో సకాలంలో సేవలు అందక పాలన గాడితప్పుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మున్సిపల్, ఎంపీడీఓ, తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీఓ కార్యాలయాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో ఒక్కో పనికి రోజంతా సమయం పడుతోంది. నాలుగు పనులు ఒకే రోజు పూర్తి చేసుకొని వెళ్లాలని వస్తే ఏ పనీ కావడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



స్త్రీ శక్తి ఉపాధి హామీ భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

ఏప్రిల్ చివరకు పూర్తవుతాయి

టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో ఏడాది క్రితం కాంట్రాక్టర్‌ని మార్చాం. ప్రస్తుతం సింధూర కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు చేస్తోంది. ఏప్రిల్ నెలాఖరునాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. త్వరలో అందుబాటులోకి తెస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈఈ

నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



సమీకృత కార్యాలయ భవనం నిర్మాణ పనులు ప్రారంభించి ఆరేళ్లు గడిచాయి. ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. ఎంపీడీఓ కార్యాలయ భవనం కోర్టుకు ఇవ్వడంతో కార్యాలయంలోని వివిధ శాఖల కార్యాలయాలు వేర్వేరు చోట్లకు తరలించడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– అందె అశోక్, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు



వర్గల్ కళాశాలలో విద్యార్థుల సందడి

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ పరీక్ష కేంద్రానికి గంట ముందే విద్యార్థులు చేరుకున్నారు. మొత్తం 420 విద్యార్థులకు గాను 13 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాజన్న తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని నంగునూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ బుధవారం తెలిపారు. 171 మంది విద్యార్థులకుగాను 163 మంది హాజరయ్యారన్నారు.

వర్గల్(గజ్వేల్): వర్గల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 382 మంది విద్యార్థులకు గాను 373 మంది పరీక్ష రాశారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

గజ్వేల్‌రూరల్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 2,327 మంది విద్యార్థులకుగాను 2019 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ, సీఐ సైదా పరీక్షా కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు. కాగా పరీక్షా ప్రారంభ సమయం ముగిసిన నిమిషాల వ్యవధిలో కేంద్రానికి చేరుకున్న విద్యార్థులను అనుమతించకపోవడంతో వారు వెనుదిరిగి వెళ్లారు.

హుస్నాబాద్: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. 240 మంది విద్యార్థులకుగాను 233 మంది హాజరయ్యారు. బాలికల జూనియర్ కాలేజీ సెంటర్‌లో 9 గంటల తర్వాత వచ్చిన ఇద్దరిని అనుమతించకపోవడంతో వారు వెనుతిరిగి వెళ్లిపోయారు.



గజ్వేల్‌లో పరీక్షా కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు



హుస్నాబాద్‌లో ఆలస్యంగా రావడంతో అనుమతించకపోవడంతో వెళ్తున్న విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 295 మందికి ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రథమ సంవత్సర పరీక్షకు 187 విద్యార్థులకుగాను 179 మంది హాజరయ్యారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శంకర్ నాయక్ తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): వరి పంటతో పాటు రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు కొనుగోళ్లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలు, నూనె గింజల సాగు చేసి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కవిత, పీఏసీఎస్ చైర్మన్ శరత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, ఫాక్స్ వైస్ చైర్మన్ రమేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మాలోతు లక్ష్మీ అన్నారు. బుధవారం అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో ఏర్పాటుచేసిన పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొద్దు తిరుగుడు పంటను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి లాభాలు ఆర్జించాలన్నారు. మండల పరిధిలో ఎక్కువ మంది రైతులు పొద్దుతిరుగుడు సాగుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పంజా రాజయ్య, వైస్ చైర్మన్ ముకుందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భూపతి సుదేష్ణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు భీలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ

తొగుట(దుబ్బాక): పొద్దుతిరుగుడు పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్యగారి హరికృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పంట సాగుచేసిన రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.6,760 చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో రెండు రోజుల్లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు.

టైలర్ల సేవలు అభినందనీయం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: సమాజానికి టైలర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కొనియాడారు. బుధవారం గజ్వేల్ నియోజకవర్గ మేరు సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్లకు తమవంతు సహకారాన్ని అందిస్తామన్నారు. మేరు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిస్కిన్ బాబు మాట్లాడుతూ టైలర్లకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ధీకొండ బాల్‌రాజు, కార్యదర్శి గూడూరి మల్లేశం, కోశాధికారి పాడిశెట్టి శ్రీనివాస్, సలహాదారులు పెండ్యాల కిషన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా బంద్

మద్దూరు(హుస్నాబాద్): ముస్త్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం దూల్మిట్ట, భైరాన్‌పల్లి, బెక్కల్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

దుబ్బాకటౌన్: ఆర్బీఐ ఆదేశాల మేరకు ఫైనాన్షియల్ లిటరసీ వీక్‌లో భాగంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు దుబ్బాక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిన్న మొత్తాల పొదుపు, సైబర్ నేరాలు, బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించారు.

హుస్నాబాద్‌రూరల్: రైతులు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు బొలిశెట్టి శివయ్య అన్నారు. బుధవారం పొట్లపల్లి గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ హుస్నాబాద్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు.

దొంగల హల్ చల్

కొండపాక(గజ్వేల్): షెడ్లలోని మేకలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. మండలంలోని సిర్సనగండ్ల, మర్పడ్గ గ్రామాల్లోని ఎలుగు యాదగిరికి చెందిన రెండు మేకలు, గొల్ల దుర్గయ్యకు చెందిన రెండు మేకలు, అంబటి నగేష్‌కు చెందిన రెండు మేకలు, పుల్ల నర్సయ్యకు చెందిన మేకతో పాటు మర్పడ్గకు చెందిన నాగరాజుకు చెందిన రెండు మేకలను ఎత్తుకెళ్లారన్నారు.

ట్రాక్టరు ట్రాలీ అపహరణ

మండలంలోని దమ్మక్కపల్లి శివారులో ట్రాక్టరు ట్రాలీని దొంగలు ఎత్తుకెళ్లారని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. మండల కేంద్రమైన కొండపాకకు చెందిన మంచాల బాలకిషన్ గౌడ్ వ్యవసాయ బావి దమ్మక్కపల్లి శివారులో ఉందన్నారు. వ్యవసాయ పనులు ముగిసినందున ట్రాక్టరు ట్రాలీని బావి వద్ద ఉంచారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సైన్స్ డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. చంద్రయాన్-3, టెలిస్కోప్, మైక్రోస్కోప్, మొక్క కణజాలాలు, పర్యావరణం, ఎలక్ట్రికల్, మానవ శరీరం తదితర నమూనాలను ప్రదర్శిస్తూ తోటి విద్యార్థులకు వివరించారు. విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు నమూనాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ఎగ్జిబిట్‌లను ప్రదర్శించిన వారికి బహుమతులు అందించారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందుతుంది

సిద్దిపేటరూరల్: సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పెంపొందుతుందని హెచ్ఎం రాజిరెడ్డి అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని చింతమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌ఫెయిర్‌తో పిల్లల్లో ఆసక్తిని పెంపొందించడంతో పాటు శాస్త్రవేత్తలను తయారు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజీజ్, బాలరాజు, రాందాస్, రాంరెడ్డి, రాజు, బైరా రెడ్డి, శ్రీశైలం, వెంకటేశం, కృష్ణమణి, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో ప్రతిభ చాటాలి

గజ్వేల్‌రూరల్: నూతన ఆవిష్కరణలతో విద్యార్థినులు తమ ప్రతిభను చాటాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ అంశంలో సైన్స్ దాగి ఉందన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన 80 నమూనాలను తిలకించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సౌజన్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాల్లో జాతీయ సైన్స్ డేని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ సౌజన్యంతో స్కూల్ విద్యార్థులకు సైన్స్ ల్యాబ్స్, జువాలజీ మ్యూజియం, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, బోటనీ, బయో టెక్నాలజీ, జువాలజీల ఆధ్వర్యంలో ఎర్త్ సెంటర్ సందర్శన కల్పించారు.



చింతమడకలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఉపాధ్యాయులు



సిద్దిపేటలోని మెరిడియన్ పాఠశాలలో భూవాతావరణం ఎగ్జిబిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సుప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు నమూనాలు ప్రదర్శించారు. గగన్‌యాన్, చంద్రయాన్, హైడ్రాలిక్ జేసీబీ, సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ ఉత్పత్తి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ ఎగ్జిబిషన్ తిలకించారు.

సంక్షిప్త వార్తలు

◆ సెల్‌ఫోన్ అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను నూతన టెక్నాలజీతో గుర్తించి బాధితులకు సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేటకు చెందిన క్రాంతి, భాను కొన్ని రోజుల క్రితం తమ సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నారు. బాధితులు సిద్దిపేట వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ యాప్ ద్వారా బాధితుల సెలఫోన్‌లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి అందజేశారు.

◆ పనుల్లో నాణ్యత పాటించాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. బుధవారం 12, 18, 20 వార్డుల్లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులు, జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

◆ భూ పంపిణీ చేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెంలో గత ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు అనర్హులకు కేటాయించారని గ్రామ దళితులు ఆరోపించారు. విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు బుధవారం బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే దీక్ష చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని హెచ్చరించారు.

◆ ఇసుక అక్రమ రవాణాచేస్తే కఠిన చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): ఇసుకను అక్రమంగా రవాణాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్దూరు ఎస్ఐ యూనస్ అహ్మద్ అలీ అన్నారు. దూల్మిట్ట మండల పరిధిలోని జాలపల్లి గ్రామ శివారులో రోడ్డు వేసి వాగు నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రెవెన్యూ, పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డును తొలగించారు.

◆ విగ్రహాన్ని తొలగిస్తే సహించం

మిరుదొడ్డి(దుబ్బాక): దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి విగ్రహాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తొలగించాలని చూస్తే సహించేది లేదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు నేరండ్ల భూమాగౌడ్, అగురం కానకారెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని చెప్యాల క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ముత్యం రెడ్డి విగ్రహాన్ని తొలగించొద్దని కోరుతూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు మండల నాయకులతో కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అల్వాల మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ మీర్జాపూర్ పాఠశాల తనిఖీ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ ప్రభుత్వ పాఠశాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులు తయారు చేసిన చిత్రపటాలను పరిశీలించి వారిని అభినందించారు.